భెల్ సేవలు అభినందనీయం

కుషాయిగూడ: సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (భెల్) సేవలు అభినందనీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ పరిధిలోని రాజీవ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులను కల్పించేందుకు భెల్ సంస్థ ముందుకు వచ్చింది. రూ.15 లక్షలతో చేపట్టనున్న ప్రహరీ, నీటిసంపు, గేటు, టాయిలెట్స్ నిర్మాణ పనులను సోమవారం స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం హర్షనీయమన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు తన సంపూర్ణ సహకారం అందజేస్తానన్నారు. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం నాగేందర్‌రెడ్డి, నాయకులు గుమ్మడి జంపాల్‌రెడ్డి, యాదగిరి, వెంకటాచారి, గడియారం రామకృష్ణ, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

వసతులేవి?



1957లో గ్రామ పంచాయతీగా బోడుప్పల్

నాడు కుగ్రామం..
నేడు నగరపాలక సంస్థ
- సౌకర్యాలు లేక జనం సతమతం
- మాస్టర్ ప్లాన్ రూపొందించడంలో విఫలం

బోడుప్పల్: బోడుప్పల్ దినదినాభివృద్ధి చెంది నేడు ఓ నగర పాలక సంస్థగా రూపాంతరం చెందింది. పెరిగిన జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీతో పాటు ఇతర సౌకర్యాలు పూర్తి స్థాయిలో కల్పించడంలో పాలకులు విఫలమవుతున్నారు. మాస్టర్‌ప్లాన్ రూపొందించి ప్రణాళికాబద్ధంగా రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీరు సౌకర్యాలు కల్పించలేదు. తాత్కాలికంగా మౌలిక వసతులు కల్పించి చేతులు దులుపుకున్నారు. దీంతో వర్షాలు పడినప్పుడు వర్షపు నీరు పోయేందుకు అవుట్‌లెట్ లేక రోడ్లు, కాలనీలు ముంపునకు గురవుతున్నాయి.

అభివృద్ధి అంతంతే

బోడుప్పల్ గ్రామపంచాయతీ ఏర్పడి 66 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. మౌలిక వసతులు కల్పించేందుకు ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి పనులు జరగలేదని స్థానికులు వాపోతున్నారు.

బోడుప్పల్, చెంగిచర్ల గ్రామాలు కలిపి 1957 సంవత్సరంలో బోడుప్పల్ గ్రామ పంచాయతీగా ఏర్పడింది. తొలి సర్పంచ్‌గా బొమ్మక్ చిత్తారి ఎన్నికయ్యారు. అప్పటి జనాభా కేవలం 1500 మాత్రమే. 1981 సంవత్సరంలో బోడుప్పల్ గ్రామ పంచాయతీ నుంచి చెంగిచర్ల విడిపోయి గ్రామ పంచాయతీగా ఏర్పడింది. 2016 సంవత్సరం ఏప్రిల్ 11వ తేదీన బోడుప్పల్, చెంగిచర్ల గ్రామాలు కలిసి మున్సిపాలిటీగా ఏర్పడ్డాయి. 2019 జూలై 23వ తేదీన బోడుప్పల్ నగర పాలక సంస్థగా రూపాంతరం చెందింది. బోడుప్పల్ నగర పాలక సంస్థ 20.05 చ.కి.మీ విస్తీర్ణంలో విస్తరించి ఉంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం 37 వేల ఇండ్లు, 175 కాలనీలు ఉన్నాయి.మొత్తం జనాభా 2 లక్షలు. 346.30 కి. మీ పరిధిలో రోడ్లు విస్తరించి ఉన్నాయి.

చిన్నపాటి వర్షాలకు రోడ్లపై నీరు నిలిచి కాలనీలు ముంపునకు గురవుతున్నాయి.

- బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని ఎగువ ప్రాంతంలో పడిన వర్షపు నీరు, మురుగునీరు దిగువ ప్రాంతానికి పోయేందుకు డ్రైనేజీ కాల్వలు లేవు. ఈ ప్రాంతమంతా వ్యవసాయ భూమిగా ఉన్నప్పుడు రా చెరువు కింద ఉన్న పొలంలో ఉన్న ఓపెన్ నాలా నుంచి ఉప్పల్ నల్ల చెరువుకు పోయేవి. పెద్ద కంచె నుంచి వచ్చే వర్షపు నీరు చాకలి గండి మీదుగా అల్మాస్ కుంటలోకి చేరేది. అక్కడ నుంచి బుద్ధనగర్ మీదుగా దిగువ ప్రాంతానికి వెళ్లేవి. చెంగిచర్ల ఐటీసీ ప్రాంతంలోని నీరు ఓపెన్ నాలా నుంచి పోచమ్మ కుంటలో చేరి, అక్కడ దిగువ ప్రాంతానికి పోయేవి. వ్యవసాయ భూములన్నీ వెంచర్లు వేసి కాలనీలుగా రూపాంతరం చెందాయి. ఓపెన్ నాలాలను, చెరువులను, కుంటలను కొంత కబ్జా చేసి కాలనీలు చేశారు. దీంతో వర్షం పడినప్పుడల్లా వర్షపు నీరు, మురుగునీరు పోయేందుకు మార్గం లేక కాలనీలను ముంచెత్తుతున్నాయి.
- పెరిగిన జనాభాకు అనుగుణంగా రహదారులు లేవు. ప్రధాన రహదారులు 60 అడుగులు, 80 అడుగులున్నాయి. కొన్ని కాలనీల్లో అయితే కేవలం 30 అడుగులు, 25 అడుగులు మాత్రమే ఉన్నాయి. దీంతో పెరిగిన జనాభాకు అనుగుణంగా రహదారులు లేక రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.
- మంచి నీటి పైపులైన్లు కొన్ని కాలనీల్లో గ్రామ పంచాయతీ కాలం నాటివి ఉన్నాయి. విస్తరించిన కాలనీలు, పెరిగిన జనాభాకు అనుగుణంగా పైపులైన్లను మార్చలేదు.

అతిసార నిర్మూలనకు నడుం బిగించాలి

మల్లాపూర్: అతిసార వ్యాధిని పూర్తిగా అరికట్టడానికి వైద్య, నీటి సరఫరా, కార్పొరేషన్ తదితర శాఖల సమన్వయం ఎంతో అవసరమని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మల్లాపూర్ సూర్యనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డయేరియా, అతిసార వ్యాధి నిర్మూలన ప్రచార కార్యక్రమంలో భాగంగా వైద్య, మున్సిపల్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. అతిసార ఇప్పటికీ ప్రజారోగ్య సమస్యగా ఉందని, పిల్లలు అతిసార వల్ల చనిపోతున్నారన్నారు. అనంతరం ఆస్పత్రి వైద్యురాలు మాధవి మాట్లాడుతూ.. జూలై, ఆగస్టు 31 వరకు చికిత్సకు అవసరమైన మందులు ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, విటమిన్ మాత్రలు కూడా అవసరమైన వారు తీసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో పద్మారెడ్డి, పీఆర్.ప్రవీణ్, ప్రభాకర్‌రెడ్డి, ఎండీ. ఉస్మాన్, రఘు తదితరులు పాల్గొన్నారు.



మందులు అందజేస్తున్న కార్పొరేటర్

కార్పొరేటర్‌ను కలిసిన ఉపాధ్యాయులు



కార్పొరేటర్‌ను సత్కరిస్తున్న హెచ్‌ఎం అంజిరెడ్డి, ఉపాధ్యాయులు

ఉప్పల్: చిలుకానగర్ ప్రభుత్వ పాఠశాలకు బదిలీపై వచ్చిన ప్రధానోపాధ్యాయులు అంజిరెడ్డి, ఇతర ఉపాధ్యాయులు సోమవారం చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్‌ను కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని కార్పొరేటర్ తెలిపారు. సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అరుంధతి సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా గణేష్

మల్లాపూర్: మల్లాపూర్ అరుంధతి సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా యెడాల గణేష్ ఎన్నికయ్యారు. బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో జరిగిన ఎన్నికల్లో కృష్ణపై 165 ఓట్లతో గణేష్ గెలుపొందారని ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ పర్నాటి వెంకట్ ప్రసాద్ తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు మాట్లాడుతూ.. సంక్షేమ సంఘం సంక్షేమానికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. తన గెలుపునకు కష్టపడిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం గణేష్‌ను పలువురు సన్మానించారు.



అధ్యక్షుడు గణేష్‌ను సత్కరిస్తున్న ప్రతినిధులు

‘రవీంద్ర భారతి’లో అక్షరాభ్యాసం



అక్షరాభ్యాసం చేయిస్తున్న ప్రిన్సిపాల్ లలిత



అక్షరాభ్యాసంలో చిన్నారులు, తల్లిదండ్రులు

కుషాయిగూడ: కుషాయిగూడలోని రవీంద్ర భారతి స్కూల్‌లో సోమవారం సామూహిక అక్షరాభ్యాసాన్ని నిర్వహించారు. నర్సరీ విద్యార్థులతో ఓనమాలు దిద్దించారు. చిన్నారుల తల్లిదండ్రులు అక్షరాభ్యాసంలో పాల్గొనడంతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లలిత, డీన్ శ్రీలత, డీఈ క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లి: రవీంద్ర భారతి పాఠశాలలో సోమవారం చిన్న పిల్లలకు అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులతో అక్షరాలను దిద్దించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ విజయ భాను, డీఐ క్రాంతి కుమార్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలి

మౌలాలి: వినాయకనగర్ డివిజన్ పరిధిలోని ఆనంద్‌బాగ్ కమ్యూనిటీ హాల్‌ను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి కార్పొరేటర్ రాజ్యలక్ష్మి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాకింగ్ ట్రాక్, నూతన కమ్యూనిటీహాల్ ఏర్పాటుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ సత్యలక్ష్మి, డివిజన్ అధ్యక్షుడు ప్రకాష్, ఉపాధ్యక్షులు సాయి, సురేష్, శ్రీకాంత్ యాదవ్, కార్యదర్శి గోపాల్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

జోనల్ కమిషనర్‌కు వినతి

వినాయక్‌నగర్ డివిజన్‌లో అవసరమైన చోట రోడ్లు, డ్రైనేజీ పనులకు నిధులు మంజూరు చేయాలని సోమవారం జోనల్ కమిషనర్ రవి కిరణ్‌కు కార్పొరేటర్ వినతిపత్రం అందజేశారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాజ్యలక్ష్మి

వీరశైవ సమాజం కార్యవర్గం ఎన్నిక

కాప్రా: వీరశైవ సమాజం కాప్రా నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పృట జ్ఞానేశ్వర్, గౌరవ అధ్యక్షుడిగా యావపురం విశ్వనాథం, ప్రధాన కార్యదర్శిగా ఈశ్వరయ్య, కోశాధికారిగా కత్తి శివానందం, ఉపాధ్యక్షులుగా రాజేశ్వర్, సిద్దేశ్వర్, మస్కరి శివ, శ్రీశైలం, సహాయ కార్యదర్శులుగా రామ్‌శెట్టి, శంభులింగం, గిరిజపతి, బసవరాజు, న్యాయ సలహాదారులుగా జీసీ బసప్ప, కార్యనిర్వాహక కార్యదర్శులుగా శంకరయ్యస్వామి, రాజేశ్వర్‌రావు, మటమ్ శివ, జగదీష్, అమరేష్, శెట్టిసాయి, శ్రీకాంత్, ప్రవీణ్, శివ, సలహాదారులుగా కొప్పునూరు బసప్ప, గంగా కుమారస్వామి, ఎన్వీ భద్రప్ప, దేశాయ్ బండేగౌడ, ఇమ్మడి వీరేశం, జగదీష్ చంద్, శశిధర్, బాల్‌రాజ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీరశైవ సమాజం అభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలిపారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి పలువురు శుభాకాంక్షలు తెలిపారు.



రేపు ఉప్పల్ డీసీతో ‘సాక్షి’ ఫోన్ ఇన్

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ డీసీ ఆంజనేయులుతో బుధవారం ‘సాక్షి’ ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. ఉప్పల్, హబ్సిగూడ, చిలుకానగర్, రామంతాపూర్ డివిజన్లలో పేరుకు పోయిన సమస్యలు, పెండింగ్‌లో ఉన్న సమస్యలు, రోడ్లు, టాక్స్ చెల్లింపులో ఇబ్బందులు, రోడ్లపై చెత్త పేరుకుపోవడం లాంటి సమస్యలను డిప్యూటీ కమిషనర్‌కు నేరుగా చెప్పుకోవచ్చు. బుధవారం ఉదయం 10.30 నుంచి 11.30 నిమిషాల వరకు 9705348172, ఉప్పల్ డీసీ 8008103667 నంబర్‌లను సంప్రదించవచ్చు.

ఆవిర్భావ వేడుకలు



గౌతంనగర్: గౌతంనగర్‌లోని వెస్ట్ మల్కాజిగిరి బ్రాంచి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 69వ ఆవిర్భావ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. బ్యాంకు మేనేజర్ సాయిలత ఖాతాదారులతో కలిసి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది కిరణ్మయి, దివ్య, శ్రీకాంత్, పాత్రో, నవీన్, ఖాతాదారులు స్వామి, నూర్, గంగాధర్, విజయప్రసాద్‌రెడ్డి, కనకతార, రాజేశ్వరి, శంకర్‌రావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతు వ్యక్తి మృతి

తొలి బీఎన్ఎస్ కేసు నమోదు

అల్వాల్: భవనంపై నుంచి కిందపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. కొత్త చట్టాలకు(బీఎన్ఎస్) అనుగుణంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాహుల్ దేవ్ తెలిపారు. కానాజిగూడ సుభాష్‌నగర్‌కు చెందిన సమీర్‌గుప్తా (63) గత నెల 26న తన ఇంటిపైన నల్లా లీకేజీ అవుతుండటంతో మరమ్మతులు చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. గాయాలతో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిరుపయోగంగా స్టాటిటిక్ ట్యాంక్



గౌతంనగర్: డివిజన్ పరిధిలోని మల్లికార్జున్‌నగర్ అంతర్గత రోడ్డులో నీటి కోసం ఏర్పాటు చేసిన స్టాటిటిక్ ట్యాంక్ నిరుపయోగంగా ఉంది. గతంలో కాలనీ వాసులకు నీటిని అందించిన ట్యాంక్ నిరుపయోగంగా ఉండటంతో నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని పలువురు కాలనీ వాసులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్యాంక్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

వసతుల కల్పనకు నిరంతర కృషి

బోడుప్పల్: డివిజన్ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు 21వ డివిజన్ కార్పొరేటర్ భూక్యా సుమన్ నాయక్ అన్నారు. రాజశేఖర్ కాలనీలో రూ. 22 లక్షల వ్యయంతో సోమవారం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నట్లు వెల్లడించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేస్తానని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు ఎలుగొండయ్య, సూర్య ప్రకాశ్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, గోవిందచారి, కాలనీ అధ్యక్షుడు సునీల్ కుమార్, కార్యదర్శి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ సుమన్‌నాయక్

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



దరఖాస్తులను స్వీకరిస్తున్న వెంకట్ రెడ్డి

మేడిపల్లి: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని మేయర్ జక్క వెంకట్‌రెడ్డి అన్నారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అధికారులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమస్యల పట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. ప్రజావాణిలో 24 ఫిర్యాదులు అందాయని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్వో శ్రీనివాస్ రెడ్డి, ఏఈ భిక్షపతి, టీపీఓ అలిపాషా, విద్యుత్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మూడు ఫిర్యాదులు

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మూడు ఫిర్యాదులు వచ్చాయని డీసీ ఆంజనేయులు తెలిపారు. రెండు ఫిర్యాదులు సీసీ రోడ్లు వేయాలని, మరొక ఫిర్యాదు టాక్స్ సెక్షన్ నుంచి వచ్చిందని చెప్పారు. త్వరలో వాటిని పరిష్కరిస్తామన్నారు.

ఘనంగా డాక్టర్స్ డే



మల్కాజిగిరి: అంతర్జాతీయ డాక్టర్స్‌డేను లయన్స్ ఇంటర్నేషనల్ 320 హెచ్ డిస్ట్రిక్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా జరిగింది. మల్కాజిగిరికి చెందిన ప్రముఖ డాక్టర్లు శేర్ల శ్రీనివాస్, రవీందర్, శివశ్రీనివాస్, వాసవి, స్వప్న, అనూష, సౌమ్యలను సన్మానించారు. కార్యక్రమంలో రీజనల్ చైర్మన్ బాలచందర్‌గౌడ్, జోనల్ చైర్మన్ శ్రీనివాస్, డిస్ట్రిక్ గవర్నర్ మనోహర్‌రెడ్డి, లింగారెడ్డి, గంపా నాగేశ్వరరావు, విశ్వేశ్వరరావు, క్లబ్ అధ్యక్షుడు పాండురంగ గుప్తా, పాల్గొన్నారు.



అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులను సత్కరిస్తున్న కార్పొరేటర్

అల్వాల్: వైద్యుల దినోత్సవం సందర్భంగా కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి అల్వాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వైద్యులు డాక్టర్ ప్రసన్నకుమారి, డాక్టర్ శైలజ, డాక్టర్ అనఘ్‌లను సత్కరించారు. కార్యక్రమంలో మల్లేష్‌గౌడ్, వీఎస్.రాజు, కన్నాగౌడ్, గిరి, అరుణ్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గౌతంనగర్: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డేను నిర్వహించారు. కార్యక్రమానికి లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ కృష్ణప్రసాద్ హాజరై మిర్జాలగూడకు చెందిన డాక్టర్ కాంబ్లేని సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు హన్మంతరావు, సుజాత, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.




సన్మానిస్తున్న సీనియర్ సిటిజన్ సంఘం సభ్యులు

గౌతంనగర్: మానవసేవే మాధవసేవ వాట్సాప్ గ్రూప్ ఆధ్వర్యంలో బస్తీ ప్రజలకు తక్కువ ఫీజుతో వైద్యం అందిస్తున్న డాక్టర్ సుధాకర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో కుమ్మరి రాజు, మహ్మద్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: వైద్యులు సమాజంలోని పేదలకు మెరుగైన వైద్యం అందించాలని నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ అన్నారు. రాఘవేంద్రనగర్‌లో శివనర్సింగ్ హోమ్ పేరుతో పేదలకు తక్కువ ధరకు వైద్యసేవలందిస్తున్న డాక్టర్ రమేష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో రాంబాబు, సంజన్నచారి, అశోక్, ప్రకాష్, ప్రీతిరెడ్డి పాల్గొన్నారు.

రామంతాపూర్: సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రామంతాపూర్‌కు చెందిన ప్రముఖ వైద్య నిపుణులు అనూష్, మల్లికార్జున్, డాక్టర్ పూర్ణ చందర్‌రావు, రామ చంద్రయ్య, శ్రీధర్, కష్తూరావు, సత్యనారాయణ, నాగరాజు, రాములుచారిని ఘనంగా సన్మానించారు.



డాక్టర్ రమేష్‌ను సత్కరిస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

విద్యార్థులకు బ్యాగులు అందజేత



విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న సభ్యులు

మల్కాజిగిరి: లయన్స్ క్లబ్ 320 హెచ్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తామని డిస్ట్రిక్ నూతన చార్టర్ గవర్నర్ మనోహర్‌రెడ్డి అన్నారు. నూతన జిల్లా ఆవిర్భావ వేడుకలు మల్కాజిగిరి పద్మావతి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబురావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేవాభావం కలిగిన మనోహర్‌రెడ్డి చార్టర్ గవర్నర్‌గా రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. అనంతరం 500 మంది పాఠశాల విద్యార్థులకు స్కూల్‌బ్యాగ్స్, నోట్ బుక్స్, జామెంట్రీ బాక్స్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో 320 మల్టిపుల్ కౌన్సిల్ లయన్ రాజిరెడ్డి, పూర్వ జిల్లా గవర్నర్లు లింగారెడ్డి, రవీంద్రనాథ్ గుప్తా, మనోహర్‌రాజు, రీజనల్ చైర్మన్ బాలచందర్‌గౌడ్, మొదటి, రెండవ గవర్నర్లు గంపా నాగేశ్వరరావు, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి బాధ్యతగా పని చేయాలి



ఆలయ చైర్మన్, ధర్మకర్తలను సన్మానిస్తున్న పరమేశ్వర్‌రెడ్డి

మల్లాపూర్: నాచారం మహంకాళి ఆలయాభివృద్ధికి నూతనంగా ఎన్నికైన చైర్మన్, ధర్మకర్తలు బాధ్యతాయుతంగా పని చేయాలని కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి అన్నారు. నూతనంగా ఎన్నికైన ఆలయ కమిటీని కాంగ్రెస్ పార్టీ నాచారం డివిజన్ అధ్యక్షుడు బందారం శ్రీకాంత్‌గౌడ్‌తో కలిసి సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గుంటుక కృష్ణారెడ్డి, సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్, పూర్ణిమ, ప్రేమ్ కుమార్‌గౌడ్, మహేష్‌యాదవ్, కాసుల మహేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న శోభారాణి

మల్కాజిగిరి: అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి బి.శోభారాణి డిమాండ్ చేశారు. ఉప్పరిగూడలో మల్కాజిగిరి సెక్టార్ అంగన్‌వాడీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చాక విస్మరించడం సరికాదన్నారు. పదవీ విరమణ చేసే ఉపాధ్యాయురాలికి రెండు లక్షలు, హెల్పర్‌కు లక్ష చెల్లించడమే కాకుండా ఇతర బెనిఫిట్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో భాగ్యరేఖ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు



అవగాహన ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయవద్దని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని ఎల్‌బీనగర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక బాధ్యతగా ఇంటింటికీ చెత్త సేకరణ కోసం వచ్చే వాహనానికి చెత్త అందజేయాలని కోరారు. వ్యాపార సముదాయాల వారు కూడా చెత్త సేకరించే ఆటోలను ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్, సిబ్బంది యాదగిరి, సంతోషమ్మ, బాలమణి, గిరి, వెంకటేశ్ పాల్గొన్నారు.

మరుగుదొడ్లను తొలగించాలి

రామంతాపూర్: చిన్న చెరువు బఫర్ జోన్‌లో జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు, మూత్రశాలలను తొలగించాలని స్థానికులు కోరారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో సర్కిల్ డీసీ ఆంజనేయులుకు వినతి పత్రం అందజేశారు. మరుగుదొడ్లను ఎవ్వరూ ఉపయోగించుకోవడం లేదని, దీంతో చెత్తాచెదారం నిండి దుర్వాసన వెదజల్లుతుందని తెలిపారు. కార్యక్రమంలో బుర్ర మహేందర్, బి.నరసింహ, రవి, లక్ష్మణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మూసీ అభివృద్ధికి సర్వే ప్రారంభం



సర్వే నిర్వహిస్తున్న అధికారులు

రామంతాపూర్: రామంతాపూర్ పరిధిలోని భగాయత్ మూసీ పరివాహక ప్రాంతాల సుందరీకరణ కోసం బఫర్ జోన్ సర్వేను రెవెన్యూ అధికారులు సోమవారం ప్రారంభించారు. ఈ సర్వే ద్వారా రామంతాపూర్ భగాయత్ మూసి పరివాహక ప్రాంతం బఫర్ జోన్‌లోని ఆక్రమణలు, గృహ నిర్మాణాలలో వాణిజ్య కట్టడాలు, ప్రార్థన స్థలాలను గుర్తించి మూసీ రివర్స్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రూపొందించిన ఫోన్ యాప్‌లో అధికారులు నమోదు చేశారు. రామంతాపూర్ పరిధిలోని మూసీ నది బఫర్ జోన్‌లోని గృహాలు, ఇతర కట్టడాలను గుర్తించి వారికి పునరావాసం లేదా పరిహారం చెల్లించే విధంగా ఈ సర్వే చేపడుతున్నట్లు సమాచారం. కార్యక్రమంలో తహసీల్దార్ రాధిక, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.